క్లుప్తంగా

పశు వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన సుజాత



చుండూరు(వేమూరు): చినపరిమి పశు వైద్యాధికారిగా సుజాత బాధ్యతలు చేపట్టారు. కొల్లిపర మండలంలోని అత్తోట గ్రామంలో పశు వైద్యాధికారిగా పని చేస్తూ బదిలీపై చుండూరు మండలం చినపరిమి గ్రామ పశు వైద్యాధికారిగా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాగా చినపరిమి గ్రామంలో పశు వైద్యాధికారిగా పని చేస్తున్న బి.అపర్ణ బదలీపై వలివేరు గ్రామం వెళ్లారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



భట్టిప్రోలు (కొల్లూరు) : అంతర్గత రహదారి సమస్యను అధిగమించేందుకు మండల పరిషత్ నిధులతో నూతన రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ దావూరి లలితకుమారి శంకుస్థాపన చేశారు. శుక్రవారం మండలంలోని పెదపులివర్రు యాదవ కాలనీలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు ఆమె పేర్కొన్నారు. రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చిన వెంటనే రోడ్డు నిర్మాణ పనులకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీదుల ఉదయభాస్కరి పాల్గొన్నారు.

టెన్నిస్ క్రీడాకారుడు పాల్‌మనోహర్‌కు సన్మానం



గుంటూరు వెస్ట్: అంతర్జాతీయ టెన్నిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వెటరన్ టెన్నిస్ క్రీడాకారుడు పాల్‌మనోహర్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, ఎన్టీఆర్ స్టేడియం టెన్నిస్ క్రీడాకారులు కలిసి ఆయనను సత్కరించారు. పాల్ మనోహర్ చిన్ననాటి నుంచి టెన్నిస్‌ను అకుంఠిత దీక్షతో సాధన చేస్తున్నారని పలువురు కొనియాడారు. ప్రస్తుతం వెటరన్ విభాగంలోనూ ఆయనకు ప్రత్యేక స్థాన ముందని తెలిపారు. టెన్నిస్ ఆడే చిన్నారులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. జెన్‌కో మాజీ ఎస్ఈ ఎం.రాజేంద్ర ప్రసాద్, టెన్నిస్ కోచ్ జీవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలి



తెనాలిటౌన్: ప్రజల త్రాగు, సాగునీటి అవసరాలకు ఫాం పాండ్‌లు వినియోగపడతాయని ఎంపీడీవో అత్తోట దీప్తి పేర్కొన్నారు. రూరల్ మండలం పెదరావూరు గ్రామంలో నిర్మాణం చేసిన నీటి కుంటలను శుక్రవారం ఆమె సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ప్రతి గ్రామంలో ఫాం పాండ్‌లను నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు నీటి కుంటలు దోహదపడతాయని వెల్లడించారు. ప్రతి గ్రామంలో నీటి కుంటల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలియజేశారు. ప్రస్తుతం పెదరావూరు, అంగలకుదురు, సంగంజాగర్లమూడి, తేలప్రోలు గ్రామంలో నీటి కుంటల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో ఆనంద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

తెనాలిరూరల్: రెవెన్యూ దినోత్సవ వేడుకలను తెనాలి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన పలువురు ఉద్యోగులను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సత్కరించారు. 1978 జూన్ 20 నుంచి నేటికీ ప్రజా సేవలో రెవెన్యూ శాఖ విస్తృత సేవలు అందించినట్లు తహసీల్దార్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తలసేమియా బాధిత చిన్నారుల కోసం రక్తదానం

తెనాలి: స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో రీజనల బిజినెస్ హెడ్ కేబీబీ శ్రీనివాసు 43వ జన్మదినం సందర్భంగా రెయిన్‌బో బ్లడ్ సెంటర్‌లో 20 మంది రక్తదానం చేశారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల సాయం కోసం రక్తదానం చేసినట్టు తెలియజేశారు. జోనల్ మేనేజర్ పినిశెట్టి బాపూజీ, బ్రాంచి మేనేజరు శ్రీనివాసరావు, సీనియర్ సేల్స్ మేనేజరు నరేష్, జయంత్‌కుమార్, సిబ్బంది లక్ష్మీ, మణికుమార్, శ్రీధర్, రామయ్య రక్తదాతలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు వీడిన గ్రహణం





మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్న నిర్మాణంలోని రైతు బజారు భవన సముదాయం

- త్వరలో ప్రారంభం కానున్న రైతు బజారు నిర్మాణ పనులు
- గత ప్రభుత్వ హయాంలో 80 శాతం పైగా పూర్తయిన పనులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఆగిపోయిన నిర్మాణం
- సాక్షి వరుస కథనాలతో స్పందించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- భవన నిర్మాణంకు నిధుల కేటాయింపు

రేపల్లె : తీర ప్రాంతంలో రైతులు పండించిన పంటను వారే స్వయంగా అమ్ముకునేలా వినియోగదారులకు సరసమైన ధరలకు నాణ్యమైన కూరగాయలు, పండ్లు అందించాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టణ నడిబొడ్డున రైతు బజారు నిర్మాణంకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి వ్యవసాయ మార్కెట్ శాఖ నుంచి రూ.2 కోట్లు కేటాయించింది. దీంతో ప్రారంభమైన పనులు ఎలక్షన్ కోడ్ వచ్చే నాటికి 80 శాతంపైగా పూర్తయ్యాయి. తదనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నియోజకవర్గంలో అభివృద్ధి పనులను పూర్తిగా విస్మరించింది. రైతు బజారు పూర్తయి వినియోగంలోకి వస్తే గత ప్రభుత్వంకు మంచి పేరు వస్తుందన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం రైతు బజారు నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించింది. రైతు బజారు ప్రాముఖ్యతను వివరిస్తూ పాలకులు, అధికారుల నిర్లక్ష్య ధోరణిపై సాక్షి వరుస కథనాలు ప్రచురించటం, రైతులు, ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుండటంతో పాలకులు, అధికారులు స్పందించారు. దీంతో రైతు బజారు నిర్మాణ పనులలో మిగిలిన 20 శాతం పనులకు ఎట్టకేలకు గ్రహణం వీడింది. ఇప్పటి వరకు వ్యవసాయ మార్కెట్ ఆధీనంలో ఉన్న రైతు బజారు నిర్మాణం మున్సిపాలిటీ అధికారులు స్వాధీనం చేసుకుని భవన నిర్మాణంకు ముందుకు వచ్చారు. దీంతో భవన నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

రైతులకు ఎంతో మేలు

రైతు బజార్ నిర్మాణం పూర్తయితే తీర ప్రాంత రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతు బజారులో రైతులు తమ పంటలను విక్రయించుకునేందుకు అవకాశం కలుగుతుంది. దీంతోపాటు వినియోగదారులకు సరసమైన ధరలకు పండ్లు, కూరగాయలు అందుబాటులో ఉంటాయి. రేపల్లె ప్రాంతంలో అరటి, సపోటా, బొప్పాయి, జామ వంటి పండ్ల సాగు, టమాటా, దొండ, బెండ, వంగ, పచ్చిమిరపలతోపాటు పలు రకాల ఆకుకూరలను రైతులు సాగు చేస్తుంటారు. ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో రైతు బజారు లేకపోవడంతో రైతులు పండించిన పంటలను సంతలు, రహదారుల వెంబడి విక్రయాలు జరుపుతూ ఇబ్బందులు పడేవారు. సమస్యను అధిగమించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు బజార్ నిర్మాణానికి రెండు కోట్ల రూపాయలను కేటాయించింది. దీంతో 15 షట్టర్లు, 22 ఓపెన్ గదులతో జరుగుతున్న భవన నిర్మాణ పనులు ఇప్పటి వరకు 80 శాతం పూర్తయ్యాయి. భవనంకు షట్టర్ల ఏర్పాటు, ప్లాస్టరింగ్, రంగులు, కరెంటు పనులు చేయడంతో పాటు పైపులైన్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంది.

> **త్వరలో ప్రారంభిస్తాం**
>
> ఆగిపోయిన రైతు బజారు నిర్మాణ పనులకు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయింపు చేశాం. త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేసి రైతులకు, వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువస్తాం.
>
> – కాకర్ల సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్, రేపల్లె

విద్యుత్ సమస్యల పరిష్కారానికే విద్యుత్ అదాలత్



అర్జీలను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ గుంటూరు ఎస్ఈ మూర్తి, అధికారులు

రేపల్లె: విద్యుత్ వినియోగదారుల సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ గుంటూరు ఎస్ఈ మూర్తి చెప్పారు. పట్టణంలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో శుక్రవారం నిర్వహించిన విద్యుత్ అదాలత్‌కు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. స్థానికంగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించుకునేందుకు అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి డివిజన్ కేంద్రంలో అదాలత్‌లు నిర్వహించి అపరిష్కృతంగా ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదాలత్‌లో వచ్చిన 13 సమస్యలలో 5 సమస్యలను సత్వరమే పరిష్కరించారు. మిగిలిన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేలు, విద్యుత్ శాఖ ఈఈ చిరంజీవి, డీఈలు శ్యామ్‌సుధాకర్‌బాబు, అశోక్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

తెనాలిఅర్బన్: సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగ సంఘ తెనాలి అధ్యక్షుడు షేక్ జానీబాషా, కార్యదర్శి ధర్మేదర సాయి, ఉపాధ్యక్షుడు సున్న అజయ్‌కుమార్‌లు కోరారు. శుక్రవారం అమరావతిలోని గ్రామ/వార్డు సచివాలయ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ శివప్రసాద్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. జీవో నెంబర్ 5ను సవరించాలని సొంత మండలాల్లో, పట్టణాల్లో ఉద్యోగులు పనిచేసే విధంగా చూడాలని కోరారు. నేషనల్ ఇంక్రిమెంట్‌లో సీనియర్ అసిస్టెంట్ పేస్కేల్‌లు వంటి వాటిని అమలు చేయాలని కోరినట్లు చెప్పారు.

ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకోవాలి



కొల్లిపర: రెవెన్యూ శాఖలో ఉన్నతాధికారుల ఆదేశాలను సిబ్బంది పాటిస్తూ, ప్రజల సమస్యలపై అవగాన పెంచుకొని విధులు నిర్వహించి రెవెన్యూ శాఖకు మంచి పేరు వచ్చేలా ప్రతి రెవెన్యూ ఉద్యోగి కృషి చేయాలని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ ఏసురత్నం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు జి.సిద్ధార్థ ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏసురత్నం పాల్గొని మాట్లాడుతూ నేడు ఎటువంటి సమస్య వచ్చినా వెంటనే రెవెన్యూ శాఖ స్పందించి అన్ని శాఖల అధికారులతో సమన్వయంగా వ్యవహరిస్తూ వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తుందన్నారు. గ్రామంలోని ప్రతి రెవెన్యూ ఉద్యోగి కష్టపడి పనిచేసి రెవెన్యూ శాఖకు మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. ఏ దేశంలో అయిన ఎన్నికలు నిర్వహించాలంటే కీలక పాత్ర పోషించేది రెవెన్యూ శాఖ అని కొనియాడారు. అనంతరం రెవెన్యూ అధికారులు విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ ఏసురత్నం, స్థానిక విశ్రాంత తహసీల్దార్ కోటిరెడ్డిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దారు రాజేష్, ఏఎస్‌వో మనోహర్‌రెడ్డి, ఆర్ఐ వంశీకృష్ణ, వీఆర్‌వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థులతో యోగా చేయిస్తున్న వ్యవసాయ అధికారి విజయ్‌రాజు

నిజాంపట్నం: యోగాతో ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న యోగా శిక్షణలో భాగంగా మండల కేంద్రమైన నిజాంపట్నం జెడ్పీ హైస్కూలులో శుక్రవారం విద్యార్థులకు యోగా శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే మండల వ్యవసాయ శాఖ అధికారి విజయరాజు యోగా చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యోగా నిత్యం చేస్తుంటే శారీరకంగా ఉల్లాసం చేకూరుతుందని శరీరంలో రక్తప్రసరణ వ్యవస్థ సక్రమంగా జరగటంతో అవయవాలన్నీ ఉత్తేజంగా పనిచేస్తాయని చెప్పారు. తమతో పాటు తమ కుటుంబ సభ్యులు, పరిసర ప్రజలు యోగా చేసే విధంగా చైతన్య పరచాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శివన్నారాయణ, పీఈటీ శివనాగలక్ష్మి, యోగా గురువు గంటా మణికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్ బహూకరణ



సీలింగ్ ఫ్యాన్‌లను అందజేస్తున్న అయ్యప్ప, సుమలత

తెనాలిఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ సభ్యులు అద్దేపల్లి అప్పయ్య, సుమలతల పెళ్ళిరోజును పురస్కరించుకుని ఐతానగర్‌లోని డగ్లస్ మెమోరియల్ రెసిడెన్షియల్ ఎలిమెంటరీ స్కూల్‌కు రెండు సీలింగ్ ఫ్యాన్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు లయన్ నేరెళ్ళ వెంకట కృష్ణమోహనరావు మాట్లాడుతూ తమకు క్లబ్ సభ్యులు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు లయన్ కాకరపర్తి సుబ్రమణ్యం, ట్రెజరర్ లయన్ డాక్టర్ కడియాల పల్లవి, అయినాల మల్లేశ్వరరావు, పాదర్తి వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం చావాలి సువర్ణలత, సుజాత, కరస్పాండెంట్ ఎస్.లతకుమారి, జాకబ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడండి

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



సూచనలిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: రోడ్లపై వ్యర్థాల గుట్టలు లేకుండా చూడాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. మారీసుపేటలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాలను ప్రతి రోజు ఉదయం తొలగించాలని సూచించారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

స్థానికంగానే వెసులుబాటు కల్పించాలి

కొల్లిపర: గ్రామ సచివాలయంలో ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న అధికారులు స్థానిక మండంలోనే ఏదో గ్రామ సచివాలయంలో విధులు నిర్వహించే విధంగా ప్రభుత్వం వెసులుబాటు కల్పించాలని యునైటెడ్ ప్రోగ్రెసివ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బండికల్లా సతీష్ డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు మండలంలోని 20 గ్రామాల్లోని ఏదో ఒక సచివాలయంలో విధులు నిర్వహించేలా వెసులుబాటు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ సచివాలయ ఉద్యోగులు శుక్రవారం ఎంపీడీవో వి.విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు వెబ్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని, అంతర్ జిల్లాల బదిలీలు అనుమతించాలని, పెండింగ్‌లో ఉన్న రెండు నోషనల్ ఇంక్రిమెంట్లను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జాబ్ కార్డులు పక్కాగా అమలు చేయలన్నారు. సచివాలయ ఉద్యోగులు, యూనియన్ నాయకులు జూలాది అంబేద్కర్, మధుసూదనరెడ్డి, రాజేష్‌నాయుడు, కంచర్ల శృతి, హెలానా, ఫణింద్రవర్మ, శశి, గంగాధర్ పాల్గొన్నారు.

యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు



యోగా గురువులను సత్కరించిన కమిషనర్ సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, సిబ్బంది

రేపల్లె: ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గత నెల రోజుల నుంచి జరుగుతున్న యోగా శిక్షణ తరగతులలో శిక్షణనిచ్చిన గురువులను శుక్రవారం పట్టణంలోని పత్తిపాటి సీతారామయోగిని కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సత్కరించి మాట్లాడారు. శారీరక, మానసిక ఉల్లాసానికి యోగా ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. యోగా ప్రాధాన్యతను గుర్తించిన ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక శిక్షణ తరగతుల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం 6 నుంచి ఏబీఆర్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గలవారు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యోగా గురువులు తూనుగుంట్ల పాండురంగారావు, సర్వేసర యోగి, గాలి సురేష్‌బాబు, మాజేటి వరప్రసాద్, వినోద్‌బాబులను సత్కరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, యోగా సెక్రటరీ కె.జగన్‌మోహన్‌రావు తదితరులున్నారు.

ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలి

ఏఐటీయూసీ ఏరియా గౌరవాధ్యక్షుడు బాలాజీ



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

రేపల్లె: పోరాటాలతో కార్మికులు సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని, రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ సమావేశంలో తీర్మానం చేసిన పది గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రేపల్లె మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రేపల్లె ఏరియా గౌరవ అధ్యక్షుడు గొట్టుముక్కల బాలాజీ మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి ఉన్న 8 గంటల పని విధానం ప్రస్తుతం కొనసాగుతుందన్నారు. 11 సంవత్సరాల క్రితం బీజేపీ నాయకత్వంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేటర్లకు ఊడిగం చేయడం కోసం కార్మికులపై కక్షగట్టి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. మోదీ ప్రభుత్వం చెప్పిందే తడవుగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం 10 గంటల పని విధానాన్ని అమలు చేసేందుకు కేబినెట్‌లో తీర్మానం చేయడం, రాత్రివేళల్లో మహిళలచే పనులు చేయించాలన్న ఆలోచన దుర్మార్గమన్నారు. తక్షణమే కేబినెట్ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, స్కీం వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిరంశెట్టి శ్రీనివాసరావు, వేణు, శివరామకృష్ణ, సాంబశివరావు, బి.దుర్గారావు, యల్లారావు, వీరాస్వామి, అనురాధ, దుర్గాభవాని, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం



కొల్లూరు తహసీల్దార్‌ను సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కొల్లూరు : రెవెన్యూ దినోత్సవాన్ని కొల్లూరు రెవెన్యూ యంత్రాంగం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకలలో భాగంగా తొలుత ఏపీ రెవెన్యూ సర్వీసెస్ మాజీ జనరల్ సెక్రటరీ తోట సుధాకరప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెవెన్యూ శాఖలో ప్రతిభ కనబర్చిన సిబ్బందిని సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లును సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.నరసింహారావు పాల్గొన్నారు.

వేమూరులో రెవెన్యూ దినోత్సవం



వేమూరు తహసీల్దారు కార్యాలయం వద్ద రెవెన్యూ దినోత్సవంలో రెవెన్యూ సిబ్బంది

వేమూరు: రెవెన్యూ ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారం చేస్తున్నామని తహసీల్దారు సుశీల అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద రెవెన్యూ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ ద్వారా రైతుల పొలాలకు అడంగల్ 1బీ, కుల ధ్రువీరణ పత్రాలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తదితర 72 సర్వీసులు, భూ సమస్యల పరిష్కార దిశగా రీ సర్వే.. ఇలా అనేక రెవెన్యూ సేవలు అందించడం జరుగుతుందని చెప్పారు. ప్రతి ఏడాది జూన్ నెల 20వ తేదిన రెవెన్యూ దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రవీంద్రబాబు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

• వ్యర్థంతో అనర్థం!



ఐతానగర్‌లోని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఇంటి సమీపంలోని మురుగు కాల్వలు వ్యర్థాలతో నిండాయి. ఖాళీ వాటర్ బాటిల్స్, ఇతర వ్యర్థాలు వాటిలో వేయడం వలన పారుదల నిలిచి పోయిందని స్థానికులు తెలిపారు. 15 రోజల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతున్నా కాల్వలను ఎవరు బాగు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు స్పందించి కాల్వలను బాగు చేయించాలని కోరారు.

– తెనాలి అర్బన్

నేడు సాహితీ ప్రముఖుడు రావినూతల జయంతి

తెనాలి: రూరల్ మండల గ్రామం అంగలకుదురుకు చెందిన ప్రముఖ రచయిత, నటుడు, దర్శకుడు రావినూతల శ్రీరామమూర్తి 74వ జయంతిని శనివారం బుర్రిపాలెంరోడ్డులోని బీసీ కాలనీలో గల పట్టణ రంగస్థల కళాకారుల సంఘ భవనంలో జరపనున్నారు. రావినూతల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో పేద కళాకారులకు బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేయనున్నట్టు కళాకారుల సంఘం కన్వీనర్ గరికపాటి సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ శాఖలో ఏఈగా చేసిన శ్రీరామమూర్తి తన ప్రవృత్తి అయిన కళారంగ సేవలో చివరివరకు కొనసాగారన్నారు. జయంతి కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శాఖమూరి నారాయణప్రసాద్, డాక్టర్ కడియాల వెంకటరమణ, గణేష్ యూత్ మురళి, అంగలకుదురు ఉప సర్పంచ్ నాగభూషణం, ఫౌండేషన్ ప్రతినిధులు ప్రకాష్, అన్నపూర్ణ, కుటుంబసభ్యులు పాల్గొంటారని తెలిపారు.

ఎస్‌బీఐ నేత తారక్‌నాథ్ సేవలు చిరస్మరణీయం

తెనాలి: భారతీయ స్టేట్‌బ్యాంక్ స్టాఫ్ యూనియన్‌కు ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన వై.తారక్‌నాథ్ సేవలు చిరస్మరణీయమని యూనియన్ తెనాలి ప్రాంతీయ కార్యదర్శి రావిపాటి ప్రేమకుమార్ అన్నారు. భారతీయ స్టేట్‌బ్యాంక్, హైదరాబాద్ సర్కిల్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి దివంగతులైన తారక్‌నాథ్ 21 వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక సాలిపేటలోని స్పెషల్ మున్సిపల్ మోడల్ ప్రైమరీస్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్, నోట్ బుక్స్, పెన్సిల్స్, ఎరేజర్స్, షార్పనర్స్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథి ప్రేమకుమార్ మాట్లాడుతూ బ్యాంక్ సిబ్బంది ఉద్యోగ సంబంధిత విధివిధానాలను ఆధునీకరించిన ఘనత తారక్‌నాథ్‌కే దక్కుతుందన్నారు. బ్రాంచ్ కార్యదర్శులు పద్మసాయి, సతీష్, హేమనాయక్, రాజాకిషోర్, మణికంఠ, సౌమ్య పాల్గొన్నారు. అనంతరం గాంధీనగర్‌లోని పట్టణ పేదల నిరాశ్రయుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. నిర్వహించారు. బ్యాంక్ శాఖా కార్యదర్శులు అంజయ్య, టీవీఎస్ రావు, శ్రీనివాసరావు ఆశ్రమంలోని పేదలకు భోజన వసతిని అందజేశారు.